
సాక్షి ఒడిశా

గురువారం । 11 । ఏప్రిల్ । 2024

I



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ. 3,97,213
బంగారం	100 మిల్లీ గ్రాములు
వెండి	48 గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

కాంగ్రెస్ ఎమ్మెల్యేకు షాక్



సార్వత్రిక ఎన్నికలకు ముందు బారాబటి – కటక్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే మహ్మద్ మొకీమ్‌కు పెద్ద షాక్. రుణ కుంభకోణం కేసులో ట్రయల్ కోర్టు అతనిని దోషిగా నిర్ధారించి జారీ చేసిన తీర్పును ఒడిశా హైకోర్టు బుధవారం సమర్థించింది.

- IIలో▸



తెలుగుదనం ఉట్టిపడేలా..!

ఉగాది ఉత్సవాలు అంబరాన్నంటాయి. సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపడుతూ మంగళవారం రాత్రి పర్లాకిమిడిలో ముగింపు ఉత్సవాలు నిర్వహించారు.

- IIలో▸

న్యూస్‌రీల్

బీజేడీ ఎన్నికల హామీల కమిటీ ఏర్పాటు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎన్నికల సన్నాహాలు ఊపందుకుంటున్నాయి. నామినేషన్ ఘట్టం దగ్గర పడుతున్న తరుణంలో ప్రధాన పక్షాల అభ్యర్థుల ఖరారు, జాబితా విడుదల ప్రక్రియ దాదాపు తుది దశకు చేరుకుంది. ఈ క్రమంలో ప్రచార దశకు అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ) సమాయాత్తమవుతోంది. బుధవారం 38 మంది సభ్యులతో కూడిన ఎన్నికల వాగ్దాన కమిటీని బీజేడీ ఏర్పాటు చేసింది. బరంపురం పార్లమెంటు సభ్యుడు చంద్ర శేఖర్ సాహు ఈ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. దేవీ ప్రసాద్ మిశ్రా, ప్రతాప్ కేశరీ దేబ్, సుదామ్ మరాండీ, మంగళ కిషన్, పద్మనాభ్ బెహెరా, కస్తూరి మహాపాత్రొ ఈ కమిటీకి కో–ఛైర్‌పర్సన్లుగా ఉన్నారు. బీజేడీ వాగ్దానాల కమిటీ సమాజంలోని వివిధ వర్గాలు, వివిధ ప్రాంతాలు, వివిధ వయసుల వారితో చర్చించి, నవీన ఒడిశా – సాధికారత ఒడిశా వైపు పరివర్తనకు దారితీసే హామీలను సిద్ధం చేస్తుంది. ఈ–మెయిల్ ఐడీ: bjdmanifesto2024@gmail.com ద్వారా వాగ్దానాల చిట్టా కోసం ప్రతిపాదనలు దాఖలు చేసేందుకు రాష్ట్ర ప్రజలకు పిలుపునిచ్చింది.

కొత్త పంచాంగం ఆవిష్కరణ



పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

రాయగడ: కేవలం తిథి, నక్షత్ర, వారఫలాలు చూసుకొనేందుకేకాకుండా పంచాంగాన్ని పూజించడం సనాతన సంప్రదాయానికి ప్రతీకని ఉత్కళ బ్రాహ్మణ సేవా సమాజం అధ్యక్షులు రేజేటి శ్రీనివాస్ శర్మ అన్నారు. ఉగాది సందర్భంగా స్థానిక కల్యాణ వేంకటేశ్వర ఆలయం సన్నిధిలో మంగళవారం సాయంత్రం నూతన పంచాంగాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సేవా సమాజం ప్రతినిధి నారాయణమూర్తి, సీనియర్ సభ్యులు ఎం.వి.రమణమూర్తి, తేన్నేటి శ్రీనివాసరావు, తెన్నేటి సీతారామమూర్తి, కె.ఎస్.ఎన్.మూర్తి ఉన్నారు. అనంతరం సభ్యులందరికీ పంచాంగాన్ని వితరణ చేశారు.

చైత్రమాస పూజలు ప్రారంభం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లాలో ఏకైక శక్తి పీఠం మా బండారు ఘరణి శక్తి పీఠంలో చైత్ర మాస పూజలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయం బయట ముహూర్తపు రాట వేశారు. దేవికి నవరాత్రులు శాంతి చేయనున్నారు. 301 అఖండ జ్యోతులు వెలిగించి నవరాత్రులు ప్రత్యేక పూజలు చేస్తారు. వేద పండితులు రాత్రి వేళ అమ్మవారి చండి పారాయణంతో శాంతింపజేస్తారు. దేవీదీక్ష బూనిన భక్తులు దేవాలయం వద్ద అమ్మవారి సేవలో నిమగ్నమయ్యారు. రాజ వంశీయులు అశిత్ దేవ్, రాం సింగ్, కమిటీ సభ్యులు మృత్యుంజయ దాస్‌లు పాల్గొన్నారు.

రూ.3.70 లక్షల స్వాధీనం



పట్టుబడిన నగదు

మల్కన్‌గిరి: జిల్లా మల్కన్‌గిరి సమితి చలాన్‌గూడ గ్రామం వద్ద మంగళవారం రాత్రి పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. మల్కన్‌గిరికి చెందిన చితురామ్ ఠాకూర్, ఎస్.రాజ్ భుతడా కలిసి కారులో రూ.3.70 లక్షలతో పట్టుపడ్డారు. ఈ నగదుకు సంబంధించిన ఆధారాలు చూపలేకపోవడంతో వారిని అదుపులోకి తీసుకున్నారు. సరైన ఆధారాలు చూపితే నగదు ఇచ్చేస్తామన్నారు.

ఉప్పొంగిన ఉత్సాహం



ఉగాది వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు, కమిటీ సభ్యులు



కోల్‌కతా కళాకారుల నృత్యప్రదర్శన



దేవస్మిత పట్నాయక్ ఒడిశీ నృత్యం



ఒడియాలో ప్రసంగిస్తున్న రష్మి గౌతం



వేడుకల్లో పాల్గొన్న జిన్ను, కౌసల్య, అనసూయ మాఝి



వేడుకలకు హాజరైన అశేష జనవాహిని

- తెలుగు సంప్రదాయం, సంస్కృతుల ప్రతిరూపమే ఉగాది
- వేడుకల ప్రారంభోత్సవంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి
- ఆకట్టుకున్న రష్మీ గౌతం ఒడియా ప్రసంగం
- ఉర్రూతలూగించిన స్థానిక కళాకారుల ప్రదర్శనలు

రాయగడ: తరతరాలుగా వస్తున్న తెలుగు సంస్కృతి, సంప్రదాయాల ప్రతి రూపమే ఉగాది వేడుకలని రాయగడ జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. స్థానిక హోటల్ తేజస్వీ మైదానంలో జిల్లా ఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో 12 ఏళ్ల ఉగాది సంబరాల్లో భాగంగా ఆయన ప్రసంగించారు. సంప్రదాయాల కనుమరుగు కాకుండా భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని, అందుకే 11 ఏళ్లుగా వైభవంగా ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తెలుగు వారి సమైఖ్యతను చాటి చెప్పే ఈ సంబరాల్లో వేలాది మంది పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు చంద్రమౌళి కుముంధాన్, సభ్యులు శిల్లా జగన్నాథరావు, రాఘవ కుముంధాన్, సంఘం నాయుడు తదితరులు పాల్గొన్నారు. గౌరవ అతిథులుగా కొరాపుట్ లోక్‌సభ మాజీ ఎంపీ జిన్ను హికక, ఆయన సతీమణి ప్రస్తుత కొరాపుట్ లోక్‌సభ స్థానానికి బీజేడీ తరఫున పోటీ చేస్తున్న కౌసల్య హికక, రాయగడ శాసనసభ బీజేడీ అభ్యర్థి అనసూయా మాఝి తదితర ప్రముఖులు హాజరయ్యారు.

ఒడియాలో ప్రసంగించిన రష్మీ..

ప్రముఖ తెలుగు టీవీ యాంకర్ రష్మీ గౌతం మంగళవారం సాయంత్రం జరిగిన ఉగాది వేడుకల్లో కొద్దిసేపు ఒడియాలో ప్రసంగించారు. తాను కూడా ఈ రాష్ట్రానికి చెందిన బిడ్డనేనని పేర్కొన్నారు. ఒడియా భాష అంటే అమితమైన గౌరవం ఉందన్నారు. ఇంతమంది తెలుగు వారు ఉన్న రాయగడ ప్రాంతంలో జరుగుతున్న ఉగాది వేడుకలకు తనని ఆహ్వానించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం డ్యాన్స్ చేసి అలరించారు.



సాన్విక నృత్య ప్రదర్శన

ప్రదర్శనలు అదుర్స్..

ఈ ఏడాది వేడుకల్లో స్థానిక కళాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో పలువురికి అవకాశం కల్పించారు. సాయిప్రియ కిడ్స్ బృందం ఉగాది విశిష్టతను వివరిస్తూ ప్రదర్శించిన స్కిట్ అలరించింది. చిన్నారి సాన్విక ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. ఉయ్–5 కళాకారులు ప్రదర్శించిన డ్యాన్స్ కుర్రకారులను ఉర్రూతలూగించింది. బెంగాల్ బ్యూటీ క్ర్యూ బృందం ప్రదర్శించిన విన్యాసాలు అదరహో అనిపించాయి. ముంబైకి చెందిన దేవస్మిత పట్నాయక్ ప్రదర్శించిన ఒడిశీ నృత్యం ఒడియా సంస్కృతికి అద్దం పట్టింది.



శివుని పాత్రలో చిన్నారి

ఉర్రూతలూగించిన సినీ సంగీత విభావరి

భువనేశ్వర్: తెలుగు సంవత్సరాది పురస్కరించుకుని జట్నీ ఊరంతా సందడిగా మారింది. మంగళవారం ఉదయం నుంచి అర్ధ రాత్రి వరకు ఈ కార్యక్రమాలు జరిగాయి. పట్టణ వ్యాప్తంగా ఉన్న తెలుగు కుటుంబాలు ఈ కార్యక్రమాల్ని విశేషంగా ఆదరించాయి. జట్నీ తెలుగు సంక్షేమ సంఘం స్థానిక అగర్వాలా ధర్మ శాల ప్రాంగణంలో సినీ సంగీత విభావరి కార్యక్రమం ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌కు చెందిన కళాకారుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంది. వీరితో స్థానిక ఔత్సాహిక యువ గాయకులు గళం పంచుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కొత్త సంవత్సరాది పురస్కరించుకుని ఈ ఏడాది పొడవునా చేపట్టాల్సిన సంక్షేమ కార్యక్రమాల ప్రతిపాదనలకు శ్రీకారం చుట్టినట్లు సంస్థ సభ్యుడు పంతుల రఘునాథ శాస్త్రి తెలిపారు.



పాటలు పాడుతున్న గాయకులు

20లోగా బీజేపీ అభ్యర్థుల పూర్తి జాబితా

- విజయ్‌పాల్ సింగ్ తోమర్

భువనేశ్వర్: బీజేపీ అభ్యర్థుల పూర్తి జాబితాను అతి త్వరలో విడుదల చేస్తామని, మరో రెండు, మూడు రోజుల్లో శాసన సభ స్థానాలకు అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని పార్టీ ఒడిశా ఎన్నికల ఇన్‌చార్జి విజయ్‌పాల్ సింగ్ తోమర్ బుధవారం తెలిపారు. రాష్ట్రంలోని మొత్తం 21 మంది లోక్‌సభ అభ్యర్థులను ఆ పార్టీ ఇప్పటికే ప్రకటించింది. 147 శాసన సభ స్థానాలకు గానూ 112 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ నెల 20 నాటికి అన్ని నియోజక వర్గాల అభ్యర్థుల జాబితా ప్రకటించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ మరో రెండు, మూడు రోజుల్లో పూర్తి చేసి అభ్యర్థుల పేర్లను ప్రకటిస్తామని నగరానికి విచ్చేసిన విజయ్‌పాల్ సింగ్ తోమర్ విమానాశ్రయంలో మీడియాకు తెలిపారు. ఇటీవల ప్రకటించిన శాసన నియోజకవర్గాల అభ్యర్థుల జాబితాలో స్వల్ప సవరణ చోటు చేసుకునే అవకాశం ఉంది. షెడ్యూల్డ్ తెగకు రిజర్వ్ చేయబడిన స్థానానికి అభ్యర్థి కేటాయింపులో సాంకేతిక లోపం చోటు చేసుకున్నట్లు భావిస్తున్నారు. దీనిని క్షుణ్ణంగా పరిశీలించిన మేరకు సంబంధిత శాసన సభ స్థానంలో మార్పు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో షెడ్యూల్ తెగకు రిజర్వ్ చేయబడిన పొట్టంగి అసెంబ్లీ నియోజకవర్గం మారే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం. త్వరలో జరగనున్న ఎన్నికల్లో బీజేపీ సన్నద్ధత కనబరుస్తోందని, అసెంబ్లీ, లోక్‌సభ సెగ్మెంట్లలోనూ ఆకట్టుకునే ప్రదర్శన కనబరుస్తుందని విజయపాల్ సింగ్ తోమర్ ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని అధిక లోక్‌సభ స్థానాలను గెలుచుకోవడంతోపాటు అసెంబ్లీ స్థానాల్లోనూ స్పష్టమైన ఆధిక్యతతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి బీజేపీ సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.



మాడుతున్న విజయ్‌పాల్ సింగ్ తోమర్

గంజాయి రవాణా గుట్టురట్టు

- కారులో తరలిస్తున్న 35 కిలోలు స్వాధీనం
- ఇద్దరు అరెస్టు



కారు, నిందితులతో దరింగబడి పోలీసు అధికారి

బరంపురం: గంజాయి అక్రమ రవాణా గుట్టురట్టయింది. పోలీసులు దాడి చేసి కారులో తరలిస్తున్న 35 కిలోల గంజాయిని స్వాధీనం చేసకొని ఇద్దరిని అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే.. దరింగబడి పోలీసు ఐఐసీ అధికారి ఉదయ చంద్ర మహంతి బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. కోంద మాల్ జిల్లా నుంచి దిగపండి మీదుగా బరంపురం వైపు హూండా సిటీ కారులో గంజాయి రవాణా అవుతున్నట్టు అందిన సమాచారం మేరకు దరింగబడి పోలీసు కలుసండపూర్ జంక్షన్‌లో నిఘా పెట్టారు. కోందమాల్ నుంచి దరింగబడిలోకి కారు వస్తున్న సమయంలో అధికారులు దాడులు చేశారు. బస్తాల్లో ఉంచిన 35 కిలోల గంజాయితో పాటు కారుని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేసినట్టు పోలీసు అధికారి చెప్పారు. అరెస్టయిన వారిలో నయాగడ జిల్లా దెవబడిగా పోలీసు స్టేషన్ పరిధి కుండగాలో గ్రామానికి చెందిన బిష్ణు పాత్రో, గంజాం జిల్లా అస్కా పోలీసుస్టేషన్ పరిధి కరియాగుడా గ్రామనికి చెందిన బబులా నాయక్ ఉన్నారన్నారు.

గంజాయితో నిందితుడి అరెస్టు



పోలీసులకు చిక్కిన నిందితుడు

రాయగడ: గంజాయి తరలిస్తున్న వ్యక్తిని గుడారి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 25.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వాహన తనిఖీల్లో భాగంగా మంగళవారం సాయంత్రం రామ్‌నగర్ కూడలిలో అనుమానాస్పదంగా వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా గంజాయిని గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసి బుధవారం కోర్టుకు తరలించారు.

బొయిపరిగుడ సమితిలో కాంగ్రెస్ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల ప్రచారం

జయపురం: ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో వివిధ పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నవరంగపూర్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి భుజబల మఝి, కొట్‌పాడ్ శాసనసభ నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి అనామ దియాన్‌లు ప్రచారాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆయా నియోజకవర్గాల పరిధిలోని బొయిపరిగుడ సమితి గ్రామ పంచాయతీల్లో బుధవారం పర్యటించి ఓటర్లను కలిశారు. రామగిరిలో పర్యటించిన వారికి ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలైన బీజేపీ, బీజేడీ, కాంగ్రెస్ అభ్యర్థులు తలపడుతున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ తమ బలాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తోంది. పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉప్పొంగింది. బైక్ ర్యాలీ రామగిరి నుంచి కందిలిబెడ గ్రామం వరకూ సాగింది. అక్కడ జరిగిన బహిరంగ సభలో నాయకులు మాట్లాడారు. పార్టీ అభ్యర్థి భుజబల మఝి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన తొమ్మిది హామీల గురించి వివరించి ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా బీజేడీకి చెందిన 250 మంది కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరగా.. వారికి నాయకులు కండువాలు వేసి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా ఉండే కొట్‌పాడ్ నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో బిజేడీ పాగా వేసింది. ఈ ఎన్నికల్లో పూర్వ వైభవాన్ని దక్కించుకోవడం ఖాయమం కాంగ్రెస్ అభ్యర్థి భుజబల మఝి వెల్లడించారు. చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రజలకు కోరారు. కార్యక్రమంలో బొయిపరిగుడ కాంగ్రెస్ అధ్యక్షుడు గౌరీచంద్ర పాఢీ, పార్టీ సీనియర్ నేత.. న్యాయవాది పి.రమేష్‌పాత్రో, ధనేశ్వర మఝి, సత్యనారాయణ మహంతి, బాలాజీరావు, మోహన శ్రీకలియ, జొగా బిశాయి, రఘునాథ్ మాలి, మహేంద్ర దొలాయి, బాబులు పాల్ పాల్గొన్నను.



కుందులిబెడ గ్రామం సభలో పాల్గొన్న ప్రజలు

రౌర్కెలా అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా దిలీప్ రాయ్!

భువనేశ్వర్: కేంద్ర మాజీ మంత్రి దిలీప్ రాయ్ రౌర్కెలా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి భారతీయ జనతా పార్టీ టికెట్‌పై పోటీ చేయనున్నారు. 1999 నాటి బొగ్గు కుంభకోణంలో తనకు విధించిన శిక్షపై ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులతో ఉపశమనం కల్పించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీజేపీ తన అభ్యర్థిత్వాన్ని ప్రకటిస్తుందని సీనియర్ బీజేపీ నేత, సుందర్‌గడ్ పార్లమెంటు సభ్యుడు జుయల్ ఓరమ్ తెలిపారు. రౌర్కెలా అసెంబ్లీ నియోజక వర్గానికి దిలీప్ రాయ్ పేరు అధికారికంగా ప్రకటించిన తర్వాత అవసరమైన సన్నాహాలు చేస్తామని జుయల్ ఓరం తెలిపారు. సుందర్‌గడ్ నుంచి ఈసారి జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న జుయల్ ఓరమ్.. రౌర్కెలా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి దిలీప్ రే పోటీ చేస్తారని ఖరారు చేశారు. త్వరలో ఆయన పేరు మీద టిక్కెట్ ప్రకటించనున్నారు. అతని పేరు ప్రకటించిన తర్వాత, పోటీకి సిద్ధం చేస్తామని జుయల్ ఓరమ్‌ నమ్మకం వ్యక్తం చేయడం విశేషం. దిలీప్ రే 1990, 2014లో రౌర్కెలా నుంచి 2 సార్లు రాష్ట్ర శాసన సభకు ఎన్నికయ్యారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో కేంద్ర మంత్రిగా, శాసన సభలో మంత్రిగా పలు కీలక శాఖల్లో బాధ్యతలు నిర్వహించారు. 1999లో జార్ఖండ్ బొగ్గు బ్లాకు కేటాయింపులో అక్రమాలకు సంబంధించిన కేసులో 2020 అక్టోబర్ నెలలో 3 ఏళ్ల జైలు శిక్ష పడింది. అంతకు ముందు 2018 నవంబర్‌లో దిలీప్ రాయ్ బీజేపీకి రాజీనామా చేశారు.

భానుడు భగభగ

- ప్రభుత్వ కార్యాలయాల పనివేళలు మార్పు

పర్లాకిమిడి: భానుడు కొద్ది రోజులుగా భగభగ మండిపోతున్నాడు. దీంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. గజపతి జిల్లా కేంద్రం పర్లాకిమిడిలో ఎండ తీవ్రత మరీ ఎక్కువగా ఉంది. రాష్ట్రంలోనే ఎక్కువ ఉష్ణోగ్రతలు వారం రోజులుగా ఇక్కడ నమోదయ్యాయి. బుధవారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత్త నమోదైంది. ప్రజలు ఎండ తీవ్రత నుంచి రక్షణకు గొడుగులు వాడుతున్నారు. కొంతమంది ముఖానికి స్కార్ఫ్‌యో కట్టుకుంటున్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నారు. అలాగే పట్టణంలోని పలు ప్రాధాన కూడళ్లలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. కాగా ఎండల తీవ్రత నేపథ్యంలో బుధవారం నుంచి గజపతి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల పని వేళలను మార్పు చేశారు. ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కార్యాలయాలు పని చేయనున్నాయి.



మార్కెట్ కూడలి వద్ద సిద్ధభైరవి మహిళా గ్రూపు ఏర్పాటు చేసిన చలివేంద్రం



పెద్ద బ్రాహ్మణ వీధి మార్కెట్ వద్ద గొడుగులు వేసుకుని వెళ్తున్న గిరిజన మహిళలు

లక్ష్మీపూర్ అసెంబ్లీ సీపీఐ అభ్యర్థిగా జానీ

జయపురం: కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్(ఎస్టీ) శాసనసభ సీపీఐ అభ్యర్థిగా కమ్యూనిస్టు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి కుమార జానీని ఆ పార్టీ ప్రకటించింది. బుధవారం జయపురం యాదవ భవనంలో కమ్యూనిస్టు పార్టీ జిల్లా స్థాయి సమావేశం పార్టీ కార్యవర్గ సభ్యుడు ప్రమోద్ కుమార్ మహంతి అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా నేతల సమావేశంలో సుదీర్ఘంగా చర్చించి కుమార జానీనీ పేరును ఏకగ్రీవంగా ఆమోదించారు. దీనిని ఆమోదించేందుకు పార్టీ అధిష్టానానికి నివేదిక పంపించాలని తీర్మాణించారు. సమావేశంలో పార్టీ కార్యదర్శి జుధిష్టర్ రౌళొ, నాయకులు నిత్యానంద పాత్రో, బుద్ర బొడొనాయిక్, సన్యాసి ఖిలో, నంద హరిజన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రమోద్‌కుమార్ మహంతి

క్లుప్తంగా

పార్టీ విజయానికి కృషి చేయండి



మాట్లాడుతున్న నెక్కంటి భాస్కరరావు

రాయగడ: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సమీపిస్తున్నందున కార్యకర్తలు కలిసికట్టుగా పార్టీ విజయానికి కృషి చేయాలని, వ్యక్తిగత విభేదాలకు స్వస్తి పలకాలని బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు పిలుపునిచ్చారు. జిల్లాలోని గుణుపూర్ శాసనసభ నియోజకవర్గం పరిధిలో చంద్రపూర్ సమితికి చెందిన కార్యకర్తలతో బుధవారం రాణిగుడ ఫారంలోని ఆయన నివాసంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నెక్కంటి మాట్లాడుతూ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునాథ్ గొమాంగోను మరోసారి గెలిపించాలని కోరారు. బిసంకటక్, రాయగడ శాసనసభలతో పాటు కొరాపుట్ లోక్‌సభ స్థానంలోనూ బీజేడీ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.

హోమ్ ఓటింగ్‌పై అవగాహన

ఆమదాలవలస రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా హోమ్ ఓటింగ్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని ఆర్‌వో, జాయింట్ కలెక్టర్ నవీన్ అన్నారు. ఆమదాలవలస మండలం కొర్లకోట సమీపంలోని ఓ ప్రైవేట్ కల్యాణ మండపంలో బుధవారం హోమ్ ఓటింగ్ విధులపై అధికారులకు అవగాహన కల్పించారు. 85 ఏళ్లు నిండిన వారికి, ఇంటి నుంచి బయటకు వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోలేని వారికి హోమ్ ఓటింగ్ విధానం అమలు చేస్తున్నామని చెప్పారు. హోమ్ ఓటింగ్ చేసే వారికి ఈ నెల 15, 16 తేదీల్లో ముందుగా తెలియజేసి వారి నుంచి ఆమోదం తీసుకోవాలని సూచించారు. ఇంటి వద్ద ఓటు వేస్తారా లేక పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటింగ్ చేస్తారే అనే దానిని స్పష్టంగా సెక్టార్ అధికారి, బీఎల్వోలు నమోదు చేయాలని తెలియజేశారు. తొలిసారి ఈ విధానం అమలవుతున్న నేపథ్యంలో విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎన్నికల్లో ఎక్కడా తప్పులు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించి, ఎన్నికలు సజావుగా జరిపించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఆర్‌వో, తహసీల్దార్ వేణుగోపాల్, ఎలక్షన్ డీటీ మురళీధర్ నాయక్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు



ఆమదాలవలస రూరల్: గాజులకొల్లివలస సమీపంలో సంగమేశ్వర ఆలయం వద్ద బుధవారం సైకతశిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంటుంది. పవిత్ర రంజాన్ పండగ సందర్భంగా సైకత శిల్పం రూపంలో శుభాకాంక్షలు తెలియజేశారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని వెంకన్నకు ముడుపు



వేంటేశ్వరస్వామికి ముడుపు వేసిన ఎత్తురాళ్లపాడు సర్పంచ్, గ్రామస్తులు

కోటబొమ్మాళి: మండలంలోని ఎత్తురాళ్లపాడు గ్రామానికి చెందిన 15 మంది మే13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు విజయం సాధించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూసర్పంచ్ తలగాన గణపతిరావు నేతృత్వంలో బుధవారం తిరుమల తిరుపతి వేంటేశ్వరస్వామికి ముడుపు వేశారు. అనంతరం కోటబొమ్మాళిలో జరిగిన ఎన్నికలకు సిద్ధం సభ హాజరై తమ సంఘీభావం తెలిపారు. తామంతా జగనన్న పాలనకు ఆకర్షితులమయ్యామని, ఎమ్మెల్యేగా దువ్వాడ శ్రీనివాస్, ఎంపీ పేరాడ తిలక్ భారీ మెజార్టీతో గెలవాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం జగన్ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన వెంటనే తిరుపతికి వెళ్లి మొక్కులుతీర్చుకుంటామని వారు స్పష్టం చేశారు.

సిలబస్‌లో మార్పులు అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లక్ష్యంగా సిలబస్‌లో మార్పులు అవసరమని అంబేడ్కర్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలో ఫిలాసఫీ అండ్ రెలీజియస్ స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ సిలబస్‌ల్లో మార్పుపై సమీక్ష నిర్వహించారు. జాతీయ విద్యా విధానం-2020కి అనుగుణంగా ప్రతి కోర్సులోనూ మార్పులు చేయాలని నిపుణులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ సుజాత, రెక్టార్ అడ్డయ్య పాల్గొన్నారు.



ప్రత్యేక ఆకర్షణగా శ్రీనివాస కల్యాణం నృత్యం



ఆకట్టుకున్న చిన్నారుల నృత్యం



ఆకట్టుకున్న మోనింగి కామేశ్వరి బృందం దుర్యోధన ప్రదర్శన

తెలుగుదనం ఉట్టిపడేలా..!

తెలుగుదనం ఉట్టిపడేలా ఉగాది ఉత్సవాలు అంబరాన్నంటాయి. సంస్కృతి సంప్రదాయాలకు అద్దంపడుతూ మంగళవారం రాత్రి పర్లాకిమిడిలోని ఖప్పా వీధి, సబుద్ధి పేట కల్యాణ మండప ప్రాంగణంలో ఆంధ్ర భాషాభివర్ధనీ సమాజం ఆధ్వర్యంలో ఉగాది ముగింపు ఉత్సవాలు నిర్వహించారు. తెలుగు సినీ సంగీత, సంప్రదాయ గీతాలు, నృత్యాలు మైమరిపించాయి. కార్యక్రమంలో అధ్యక్షుడు సత్యనారాయణ బాబు, రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. ఛత్రపూర్‌లో తెలుగు కల్చరల్ సంఘం అధ్యక్షుడు న్యాయవాది శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. – బరంపురం



ఛత్రపూర్‌లో ఉగాది ఉగాది ఉత్సవాలు



ఉత్సవాల్లో పాల్గొన్న బరంపురం తెలుగు ప్రజలు



బరంపురం ఉగాది ఉత్సవాల్లో పాల్గొన్న తెలుగు ప్రతినిధులు



హాజరైన అధ్యక్షులు సత్యనారాయణబాబు, వెంకటరమణ, శ్రీనివాసరావు దంపతులు

కాంగ్రెస్ నేత మహ్మద్ మొకీమ్‌కు షాక్



మహ్మద్ మొకీమ్

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలకు ముందు బారాబటి - కటక్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే మహ్మద్ మొకీమ్‌కు పెద్ద షాక్. రుణ కుంభకోణం కేసులో ట్రయల్ కోర్టు అతనిని దోషిగా నిర్ధారించి జారీ చేసిన తీర్పును ఒడిస్సా హైకోర్టు బుధవారం సమర్థించింది. 2022 సెప్టెంబర్ 29న ఒడిశా రూరల్ హౌసింగ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఓఆర్‌హెచ్‌డీసీ) అవినీతి కేసుకు సంబంధించి ప్రత్యేక విజిలెన్స్ కోర్టు మహ్మద్ మొక్విమ్‌తో పాటు మరో ముగ్గురికి 3 ఏళ్ల జైలు శిక్ష విధించింది. మహ్మద్ మొకీమ్ ట్రయల్ కోర్ట్ ఆదేశాన్ని సవాలు చేశారు. అక్టోబరులో కాంగ్రెస్ శాసన సభ్యుడు చేసిన అప్పీల్‌ను అనుసరించి హై కోర్టు దీనిని అసాధారణమైన కేసుగా అభివర్ణిస్తూ అతని శిక్షను నిలిపివేసింది. రాష్ట్ర శాసన సభ సభ్యునిగా కొనసాగడానికి అనుమతించింది. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వుల పట్ల రాష్ట్ర విజిలెన్స్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం (ఆర్‌పీఏ) ప్రకారం జరిమానా లేదా రెండు సంవత్సరాల కంటే ఎక్కువ శిక్ష విధించబడిన ఎమ్మెల్యేలు అనర్హులు. ఈ కేసులో సుప్రీం కోర్టు చొరవ కల్పించుకోవాలని 2023 సెప్టెంబరులో రాష్ట్ర విజిలెన్సు స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్‌పి) దాఖలు చేసింది. ఆరు నెలల్లోగా ఈ కేసు విచారణ పూర్తి చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. వృత్తిరీత్యా ఇంజనీర్ అయిన మహ్మద్ మొకీమ్ ఓఆర్‌హెచ్‌డీసీ నుంచి గ్రామీణ పేదల కోసం ఉద్దేశించిన రుణాల ముసుగులో ఆయన ఆధ్వర్యంలో పని చేస్తున్న నిర్మాణ సంస్థ మెట్రో బిల్డర్స్‌కు అనుకూలంగా రుణ సౌకర్యం కల్పించినట్లు ఆరోపణలు వచ్చాయి. మెట్రో సిటీ- 2 ప్రాజెక్ట్ కోసం రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థ ఓఆర్‌హెచ్‌డీసీ 2000లో రూ.1.5 కోట్ల రుణాన్ని అక్రమంగా మంజూరు చేసింది. రుణ మంజూరి ప్రక్రియకు నీళ్లొదిలి హడావిడిగా ఖరారు చేయడం ప్రశ్నార్థకంగా మారింది. రుణ సౌకర్యం పొందిన నిర్మాణ సంస్థ రుణం మొత్తం తిరిగి చెల్లించలేదని విజిలెన్స్ గుర్తించింది. 2007 జూలై 31 నాటికి, మెట్రో బిల్డర్ల బకాయి మొత్తం రూ.6.22 కోట్లకు చేరుకుంది. మహ్మద్ మొకీమ్‌తో పాటు ఈ కేసులో బహిష్కృతులైన ఐఏఎస్ అధికారి వినోద్ కుమార్, మెట్రో బిల్డర్స్ డైరెక్టర్ పీయూష్ మహంతి, ఓఆర్‌హెచ్‌డీసీ మాజీ కంపెనీ సెక్రటరీ స్వాస్తీ రంజన్ మహాపాత్రోకు కూడా ట్రయల్ కోర్టు అదే శిక్ష విధించింది. ఈ సంవత్సరం ప్రారంభంలో కాంగ్రెస్ మహ్మద్ మొకీమ్ సస్పెన్షన్‌ను ఉపసంహరించుకున్నప్పటికీ రాబోయే ఎన్నికలకు అదే స్థానం నుంచి అతని అభ్యర్థిత్వాన్ని ఇంకా ప్రకటించలేదు. అతని నేరారోపణపై సుప్రీం కోర్టు స్టే జారీ చేస్తే తప్ప అతను అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అర్హత పొందలేడని చర్చ జోరందుకుంది.

గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు



కూనేరు రామభద్రపురం పీహెచ్‌సీలో గర్భిణులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు

కొమరాడ: ఎండలు అధికంగా ఉన్నందున గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి వారికి వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి బి.జగన్నాథరావు అన్నారు. మండలంలోని కూనేరు రామభద్రపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. పీఎం ఎస్ఎంఏ(ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్) కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలు, పీఆర్‌ఐ ఎం-10 కార్యక్రమం అమలుపై ఆరాతీశారు. దత్తత తీసుకున్న అధికారి వస్తున్నారా లేదా..? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రక్త హీనత, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, వడ దెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎండలో బయటకు వెళ్లే వ్యక్తులు కచ్చితంగా టోపీ పెట్టుకుని, మంచినీరు పట్టుకుని వెళ్లాలని సూచించారు.

కోదండరామ స్వామికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న స్వామివారు

గరుగుబిల్లి: శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా కోదండరామాలయంలో బుధవారం ఉదయం శ్రీరామ సుప్రభాతసేవ, ఆరాధన, మంగళాశాసనం, రుత్విక్ వరుణ తదితర పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామ, లక్ష్మీమంత్ర జపములు, శ్రీమద్రామాయణ పారాయణం చేపట్టారు. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈనెల 17న శ్రీసీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

13న రామాలయ పునఃప్రతిష్ఠ

గరుగుబిల్లి: మండలంలోని కొంకడివరం పంచాయతీ సీతారాంపురం గ్రామంలో ఈనె 13న సీతారామ లక్ష్మణ ఆంజనేయ ఉత్సవ విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 12 సాయంత్రం నుంచి పూజా కార్యక్రమాలను ప్రారంభించి, 13న ఉత్సవ విగ్రహాల పునఃప్రతిష్ఠ, కల్పవృక్షం ప్రతిష్ఠ తదితర కార్యక్రమాలను అర్చకులు కె.మురళీమోహన్‌శర్మ పర్యవేక్షణలో చేపట్టనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

గిరిజన గ్రామాల్లో నిరంతర వైద్య సేవలు

పార్వతీపురం టౌన్: గిరిజన గ్రామాల్లో నిరంతర వైద్యసేవలు అందిస్తున్నట్లు వైద్యాధికారి ఐశ్వర్య చెప్పారు. ఈ మేరకు పార్వతీపురం మండలంలోని డోకిశీల గిరిజన గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో 80 మంది రోగులకు బుధవారం ఆమె వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫ్యామిలీ ఫిజీషియన్ విధానంలో ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యాధికారులు నియమితులయ్యారని, ఒకరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మరొకరు ప్రజల వద్దకు వెళ్లి వైద్యసేవలు అందిస్తారని చెప్పారు. గ్రామాల్లో మంచానపడి ఉన్న వృద్ధులు, గర్భిణులు, బాలింతలకు వారి ఇళ్ల వద్దే వైద్యసేవలు అందించినట్లు తెలిపారు. గ్రామాల్లో దాదాపు 13 రకాల వైద్య సేవలు అందిస్తున్నామని, 67 రకాల మందులు, 14 రకాల డయాగ్నోస్టిక్ సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఎనిమిది రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగులకు నెలకు సరిపడా మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, 104 వాహన సిబ్బంది, ఆశ కార్యకర్తలు ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

సరిహద్దు భద్రత కీలకం



చెక్‌పోస్టును తనిఖీచేస్తున్న తహసీల్దార్ కె.ఆనందరావు

పార్వతీపురంటౌన్: ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లో భద్రత కీలకమని తహసీల్దార్ కె.ఆనందరావు, అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన పార్వతీపురంలోని వెంకంపేట గోరీల వద్దగల చెక్ పోస్టులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో ప్రశాంతంగా ఎన్నికలు నిర్వహించేందుకు ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాలో భద్రత కీలకమన్నారు. పక్కా రాష్ట్రం ఒడిశా నుంచి గంజాయి, సారా, మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై దృష్టిసారించి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించాలని కోరారు. ముఖ్యంగా ఎన్నికల నేపథ్యంలో ఒడిశా రాష్ట్రం నుంచి డబ్బు రవాణాపై దృష్టి సారిస్తూ ముందస్తు సమాచారం సేకరించాలని సూచించారు. అనుమానం ఉన్న వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యేవరకు అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. పట్టణ ఎస్సై సంతోషి, ఆర్‌ఐలు రామకృష్ణ, నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్టు

పాలకొండ రూరల్: స్థానిక పోస్టాఫీస్ రహదారిలో 13 మద్యం బాటిళ్లను అక్రమంగా తరలిస్తున్న వీరఘట్టం మండలం పనస నందివాడకు చెందిన ధర్మావును ఎస్ఐ ఎస్.ప్రశాంత్ కుమార్ అదుపులోకి తీసుకున్నారు. బుధవారం విజుబుల్ పోలీసింగ్‌లో భాగంగా ఆ ప్రాంతాల్లో తనిఖీలు చేస్తుండగా ధర్మారావు నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనపర్చుకుని, కేసు నమోదు చేయటంతో పాటు అరెస్టు చేసామని తెలిపారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం కూడదు

పార్వతీపురం టౌన్: ఎన్నికల విధుల్లో అలసత్వం వహించరాదని తహసీల్దార్ కె.ఆనందరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వహించే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. తమ పరిధిలో అప్పగించిన విధులను అంకితభావంతో చేయాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో ఎంసీసీ ఉల్లంఘనపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ముందస్తు కొలతలు ఇవ్వాలి



మాట్లాడుతుతన్న ఏపీడీ శ్రీహరిరావు

గరుగుబిల్లి: వేతనదారులకు ముందస్తు కొలతలు ఇచ్చి ఉపాధి పనులను వేతనదారులతో చేయించాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ జి.శ్రీహరిరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ నెలాఖరు నాటికి వేతనదారులకు లక్షాడబ్బైవేల పనిదినాలను కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సిబ్బందికి సూచించారు. మండలం నుంచి రోజుకు 7వేల మంది ఉపాధి పనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. వేతనదారుల హాజరును ఎన్ఎంఎస్ యాప్ ద్వారా ఎప్పటికప్పుడు పంపించాలన్నారు. ఏప్రియల్ నెల నుంచి గరిష్ఠ వేతనం రూ.300లకు పెంచడం జరిగిందన్నారు. ఎంపీడీఓ పి.సూర్యనారాయణ మాట్లాడుతూ.. రెండు పూటలా పనులు చేయాలని, ఎండల తీవ్రత కారణంగా ఉదయం 10 గంటల లోపు పనులను ముగించుకోవాలన్నారు. సాయంత్రం 4 గంటల తరువాత పనులలో పాల్గొనాలన్నారు. పని ప్రదేశంలో అవసరమైన తాగు నీరు, టెంట్లను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ ఎం.గౌరీనాద్, జేఈ డి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా తనిఖీలు



తాటిశీల చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

గుమ్మలక్ష్మీపురం: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీస్ ఉన్నతాధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. సార్వత్రిక ఎన్నికల వేల ధన ప్రవహం, పంపిణీ చేసేందుకు తరలించే కానుకల ప్రవాహంకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద కేంద్ర బలగాలతో కలిసి ప్రతీ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. మండలంలోని ఆంధ్రా సరిహద్దు గ్రామమైన తాటిశీల వద్ద (గుణుపూర్ రోడ్డు) ఎల్విన్‌పేట పోలీసులు చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టు వద్ద ఒడిశా నుంచి అక్రమంగా మద్యం, డబ్బు రాకుండా తనిఖీలు చేస్తున్నారు. రూ.50 వేలు మించి నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు తీసుకు వెళ్తే వాటిని సీజ్ చేస్తున్నారు. సిఫ్టుల వారిగా విధులు నిర్వహిస్తూ.. నిఘా పటిష్టం చేశారు.

రోగులకు పౌష్టికాహారం వితరణ



పెదంకలాం పీహెచ్‌సీలో పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న డాక్టర్ రాధాకాంత్

సీతానగరం: మండలంలోని పెదంకలాం పీహెచ్‌సీలో వైద్య సేవలకోసం వచ్చిన రోగులకు బలిజిపేట మండలంలోని అజ్జాడ సత్యసాయి భక్తులు సమకూర్చిన పౌష్టికాహారాన్ని డాక్టర్ రాధాకాంత్ బుధవారం పంపిణీ చేశారు. ఈ మేరకు డాక్టర్ రాధాకాంత్ మాట్లాడుతూ అజ్జాడ గ్రామానికి చెందిన సత్యసాయి భక్తసమాజం కమిటీ సభ్యులు ప్రతి బుధవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తారని తెలియజేశారు. వైద్య సిబ్బంది సూచనల మేరకు అదే రోజు ఎంతమంది వైద్యసేవల నిమిత్తం రోగులు పెదంకలాం పీహెచ్‌సీకి వచ్చినా సత్యసాయి సేవా సమితి తాజాగా సమకూర్చిన ఆహారాన్ని అందజేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

• గిరిజన గ్రామాలకు పక్కా రహదారి



గతంలో నడవడానికి వీల్లేని బిచ్చుమానుగూడ మట్టి రోడ్డు



పాలవలస నుండి బిచ్చుమానుగూడకు వేసిన తారు రోడ్డు

భామిని మండలంలోని పాలవలస నుంచి బిచ్చుమానుగూడ వరకు పక్కా రహదారి వేశారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డుపై నడిచేందుకు కూడా పాదచారులు సైతం అవస్థలు పడేవారు. నేడు వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సుమారు 11.50 కిలోమీటర్ల మేర రూ.7.18 కోట్లతో ఏడు గిరిజన గ్రామాలను కలుపుతూ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త నిధులతో ఈ రహదారి పూర్తవడంతో గిరిజనులు సంతోషపడుతున్నారు. తమ రహదారి కష్టాలు తీరాయని సంబరపడుతున్నారు. – భామిని

ఉపాధి పనుల పరిశీలన

పాలకొండ రూరల్: ప్రస్తుత వేసవిలో ఉపాధి పనులు జరిగేచోట అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ అన్నారు. మండలంలోని అన్నవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ గ్రామ పరిధిలో 17 గ్రూపులకు సంబంధించి పనులకు హాజరవుతున్న 152 మంది వేతనదారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వేసవి నేపథ్యంలో వడదెబ్బకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం రోజువారీ వేతనం రూ.272 నుంచి రూ.300లకు పెరగటంతో కచ్చితంగా పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. క్షేత్ర సహాయకులు ఈ మేరకు వారిని నడిపించాలన్నారు.

క్లుప్తంగా

ఎన్నికల్లో సెక్టార్ అధికారులు కీలకం


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హేమలత

పార్వతీపురం టౌన్: ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకమని పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి, పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి హేమలత అన్నారు. ఈ మేరకు పార్వతీపురంలో బుధవారం ఆమె ఎన్నికల సెక్టార్ అధికారులు ఏఎల్ఎంటీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సెక్టార్ అధికారి తన పరిధిలోని పోలింగ్ కేంద్రాలు, రూట్‌లను క్షుణ్ణంగా పరిశీలించాలని ఆదేశించారు. వాహనాల రాకపోకలు, ఇతర అంశాలపై స్పష్టమైన అవగాహన ఉండాలని స్పష్టం చేశారు. సమాచారం వేగంగా అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ ప్రణాళిక

- జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లాలో నీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశామని జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ. ప్రభాకరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం అన్ని గ్రామాల్లో సరిపడా నీటి లభ్యత ఉందన్నారు. జిల్లాలోని 44 గ్రామాలలో నీటి ఎద్దడి ఉండవచ్చని అంచనా వేసి ఆ మేరకు రూ.23.90 లక్షలతో నీటి రవాణా చేసేందుకు కార్యాచరణ ప్రణాళికలు తయారు చేశామని చెప్పారు. అవసరం మేరకు వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయగలమన్నారు. పాలకొండ మండలంలోని అంపిలి, భామిని మండలంలో దొంకుల గూడ, సీతంపేట మండలంలో జొన్నగూడ, జియ్యమ్మవలస మండలంలో తాళ్లడుమ్మ, కురుపాం మండలం, ఇతర మండలాల్లో జల జీవన్ మిషన్ కింద అనేక గ్రామాల్లో పనులు చేపట్టామని, కొన్ని పనులు త్వరలో పూర్తి కాగలవని స్పష్టం చేశారు.

842 మద్యం బాటిల్స్ ధ్వంసం


పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మద్యం బాటిల్స్‌ను ధ్వంసం చేస్తున్న పోలీసులు

సీతానగరం: మండలంలో వివిధ కేసుల్లో పట్టుబడిన 842 మద్యం సీసాలను పోలీస్‌స్టేషన్ ఆవరణలో బుధవారం సాయంత్రం ధ్వంసం చేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ఇదివరలో పోలీస్ సిబ్బందితో గ్రామాల్లో దాడులు చేసిన సమయాల్లో అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తుండగా, బెల్ట్‌షాపులు నిర్వహించే సమయంలో దాడులు చేసిన సమయంలో నిందితులపై కేసులు నమోదు చేసి మద్యం సీసాలను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ సునీల్ శరణ్ ఆధ్వర్యంలో మద్యం సీసాలను ధ్వంసం చేసినట్లు తెలియజేశారు.

మృత్యుంజయుడు


బావి నుంచి ప్రాణాలతో బయటపడిన అప్పన్న

నరసన్నపేట: అగ్నిమాపక సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించడంతో ఓ వ్యక్తి ప్రాణాలతో బయటపడ్డాడు. వివరాల్లోకి వెళ్తే.. బొరిగివలసకు చెందిన కోనంగి అప్పన్న బుధవారం జమ్ము కూడలి వద్ద కృష్ణానగర్ కాలనీలో కూన ప్రమీల ఇంటి ఆవరణలో ఉన్న పురాతనమైన 25 అడుగుల బావిలో మట్టి తీయడానికి దిగాడు. ఈ క్రమంలో బావి అడుగున ఉన్న నందలు విరిగిపోవడంతో భుజాల వరకు కూరుకుపోయాడు. వెంటనే గమనించిన ప్రమీళ స్థానిక అగ్నిమాపక సిబ్బందికి మధ్యాహ్నం 12.07గంటలకి ఫోను చేశారు. 12.15 కల్లా బావి వద్దకు చేరుకున్న సిబ్బంది పరిస్థితిని పరిశీలించి రోప్ సహాయంతో లోపలికి దిగారు. శిథిలమైన నందల వ్యర్థాలను బకెట్ సహాయంతో తొలగించి అప్పన్నను బయటకు తీసుకువచ్చారు. 1.50 గంటల నిమిషాలకు రెస్క్యూ ఆపరేషన్ పూర్తి చేశారు. తీవ్ర గాయాలతో ఉన్న అప్పన్నను 108 అంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బందిని స్థానికులు అభినందించారు.

నోరూరించేలా..

- ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం
- రోజుకు సుమారు లక్షా51వేల905 మందికి వడ్డింపు
- రోజుకో వంటకంతో రుచికరంగా జగనన్న గోరుముద్ద


లక్కవరపుకోట ఏపీ మోడల్ స్కూల్‌లో జగనన్న గోరుముద్ద భోజనం చేస్తున్న విద్యార్థులు


ఎల్.కోట కేజీబీవీలో చదువుకుంటున్న విద్యార్థినులు


రుచికరమైన భోజనం

కొత్తవలస/రాజాం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటూ నోరూరించే భోజనం కూడా ప్రభుత్వం అందిస్తోంది. రోజుకో వంటకంతో ఘుమఘుమ లాడేలా జగనన్న గోరుముద్దను అందజేస్తోంది. మధ్యాహ్న భోజనం పథకం మెనూను జగనన్న ప్రభుత్వం మార్చి మరింత రుచికరంగా అందిస్తోంది. పాఠశాలల్లో మెనూ సక్రమంగా అమలయ్యేలా పర్యవేక్షణ పెంచింది. దీంతో నిత్యం ఏదో ఒక పాఠశాలలో ఉన్నతాధికారులు ఆకస్మిక పర్యటన చేస్తున్నారు. మారిన మెనూతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భోజనం రుచికరంగా ఉందంటూ సంతోషంగా చెబుతున్నారు.


రాజాం: పెనుబాక పాఠశాలలో జగనన్న గోరుముద్ద కోసం క్యూలో విద్యార్థులు

ఒకటి నుంచి 10 వరకు విద్యార్థులకు అమలు

జిల్లాలో గల ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేస్తున్నారు. మారిన మెనూ ఎంతో బాగుందని రుచికరంగా ఉందని పలువురు విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో రాగిమాల్ట్ అందించేలా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

విందు భోజనంలా ఉంది



ప్రస్తుతం మారిన మెనూ ఎంతో బాగుంది. రుచికరమైన భోజనం వడ్డిస్తున్నారు. విందు భోజనం చేస్తున్నట్లు ఉంది. స్నేహితులందరం ఒకే దగ్గర కూర్చుని తింటున్నాం. జగన్ మామకు రుణపడి ఉంటాం.

-పినిశెట్టి హాసిని, 8వ తరగతి, ఏపీ మోడల్ స్కూల్ ఎల్.కోట

1145 మంది మధ్యాహ్న భోజన నిర్వాహకులు

విద్యార్థులకు రుచికరమైన పౌష్టికాహారం అందించడంతో పాటు పాఠశాల ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచేలా విద్యాశాఖ ఆధ్వర్యంలో తగిన ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులు జిల్లాలో సుమారు 1145 మంది ఉండగా వారికి గత ప్రభుత్వంలో కేవలం గౌరవ వేతనం కింద నెలకు వెయ్యి రూపాయలు అందించేవారు. ప్రస్తుతం జగన్న ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఒక్కొక్కరికి గౌరవ వేతనం రూ.3వేలకు పెంచింది. దీంతో నిర్వాహకులు ఉత్సాహంతో ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం రుచికరమైన వంటకాలు చేసి విద్యార్థులకు వడ్డిస్తున్నారు. అలాగే పాఠశాలల ప్రాంగణాలు పరిశుభ్రంగా ఉంచేందుకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా 958 మంది ఆయాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియమించింది. వారికి ఒక్కొక్కరికి నెలకు రూ.6వేల వేతనం అందజేస్తున్నారు. దీంతో పాఠశాలల ప్రాంగణాలు, మరుగుదొడ్ల నిర్వహణ బేషుగ్గా ఉంది. చిన్నారులు అనారోగ్యం బారిన పడకుండా ఆరోగ్యంగా ఉన్నారు.

రూ.3వేల గౌరవ వేతనం



గత ప్రభుత్వంలో మాకు కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే ఇచ్చేవారు. అదికూడా ఆరునెలలకు ఒకసారి మాత్రమే ఇచ్చేవారు. ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి గౌరవ వేతనం రూ.3వేలకు పెంచి నెలనెల క్రమం తప్పకుండా అందిస్తోంది. సంతోషంగా వంటలు చేయుగలుగుతున్నాం.

-విరోతి దేవి, మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలు, కొత్తవలస హైస్కూల్

మెనూ వివరాలు ఇలా

సోమవారం: హాట్‌పొంగల్, ఉడికించిన గుడ్డు లేదా పలావ్‌తో ఎగ్‌కర్రీ, వేరుశనగ చక్కీ
మంగళవారం: దొండకాయ చట్నీతో చింతపండు పులిహోర, ఉడికించిన గుడ్డు
బుధవారం : కూరగాయ అన్నం, బంగాళదుంప కుర్మా, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చక్కీ
గురువారం: సాంబార్ బాత్ లేదా టమాటో చట్నీతో నిమ్మకాయ రైస్, ఉడికించిన గుడ్డు
శుక్రవారం: అన్నం, ఆకుకూర పప్పు, ఉడికించిన గుడ్డు, వేరుశనగ చక్కీ
శనివారం: ఆకుకూర అన్నం, పప్పుచారు.

జీవనోపాధి కల్పించారు



గతంలో పాఠశాలల్లో పారిశుద్ధ్య పనులను నిర్వహించినా కనీసం గుర్తింపు లేకుండా పోయింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి నెలకు రూ.6వేలు ఇస్తున్నారు. క్రమం తప్పకుండా నెలనెల వేతనం అందుతోంది. పాఠశాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మావంతు కృషి చేస్తున్నాం. గతంలో పాఠశాల పరిశుభ్రత పిల్లలతో నిర్వహించేవారు.

-ఎ.చంద్రకళ, పారిశుద్ధ్య నిర్వాహకురాలు, కొత్తవలస హైస్కూల్

పని ప్రదేశంలో సౌకర్యాలు

- డ్వామా పీడీ రామచంద్రరావు


గొట్టివలసలో పనుల ప్రదేశంలో ఏర్పాటుచేసిన పందిరి

పార్వతీపురం: వేసవి ఎండతీవ్రత, వడగాలుల నుంచి వేతనదారులకు రక్షణ కల్పించేందుకు పని ప్రదేశంలో అవసరమైన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా నీటి యాజమాన్యసంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు అన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన గరుగుబిల్లి మండలంలోని గొట్టివలస, రావుపల్లి, ఉల్లిభద్ర తదితర గ్రామాలలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి నెల వరకు ఉపాధిహామీ వేతనదారులకు వేతనాలు చెల్లించామని తెలిపారు. మార్చి నెలకు సంబంధించి వేతనం జమ కావాల్సి ఉందన్నారు. మార్చి నెలకు సంబంధించిన బిల్లులు ఎఫ్‌టీఓలను ఎప్పటికప్పుడు ఎన్‌ఐసీ.వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేశామన్నారు. ఎన్‌ఐసీలో పేమెంట్ జరిగిన వెంటనే నేరుగా వేతనదారుని ఖాతాలో నగదు జమ అవుతుందని స్పష్టం చేశారు. ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న ప్రదేశంలో అందుబాటులో ఉన్న పాత టెంట్లు ఏర్పాటుచేశామని తెలిపారు. టెంట్లు లేని గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలు మేరకు లోకల్ మెటీరియల్‌తో నీడ కోసం వేతనదారులు, గ్రామస్తుల సహకారంతో పందిరిని ఏర్పాటు చేశామన్నారు. మెడికల్ కిట్స్ అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. పనులను ఉదయం 10.30గంటల లోపు ముగించి, సాయంత్రం నాలుగు గంటలకు పనుల్లో మళ్లీ పాల్గొనేలా వేతనదారులకు సూచించామని తెలిపారు.

కూటమి మాకొద్దు..వైఎస్సార్‌సీపీయే ముద్దు


టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో వైఎస్సార్‌సీపీ నాయకులు

- వైఎస్సార్‌సీపీలో 40 కుటుంబాల చేరిక
- కండువాలు వేసి ఆహ్వానించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

విజయనగరం: ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ఆకర్షితులైన టీడీపీ , జనసేన పార్టీలకు చెందిన నాయకులు ఎన్నికల తరుణంలో వైఎస్సార్‌సీపీకి జై కొడుతున్నారు. ఆ పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఈ మేరకు బుధవారం విజయనగరంలోని 37వ డివిజన్ బీసీ కాలనీకి చెందిన 40 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ జోనల్ ఇన్‌చార్జి కోలగట్ల తమన్న శెట్టి, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావులు నూతనంగా పార్టీలోకి చేరిన వారికి కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కోలగట్ల తమన్న శెట్టి మాట్లాడుతూ అభివృద్ధి సంక్షేమ పాలనకు ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలోకి చేరికల పర్వం కొనసాగుతోందన్నారు. ఈ నేపథ్యంలో 40 కుటుంబాల వారు బీసీ కాలనీ చెందిన ఇతర పార్టీల కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరడం ఆనందంగా ఉందని చెప్పారు.

రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయ ఢంకా మోగించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ శెట్టివీరవెంకట రాజేశ్వరరావు మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఐదేళ్లపాటు అనేక మౌలిక సదుపాయాలు కల్పించి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దారన్నారు. మరోసారి అవకాశం ఇస్తే ఉపాధి పరంగా కూడా అవకాశాలు మెరుగుపరుస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కడియాల రామకృష్ణ, బొబ్బాది త్రినాథరావు, అర్జున్, మురళి, స్వామి, మజ్జి శ్రీను నారాయణప్పుడు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి


మామిడితోటలో రామన్న మృతదేహం

దత్తిరాజేరు: మండలంలోని మరడాం జాతీయ రహదారి పక్కన మామిడి తోటలో వడదెబ్బతో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ బుధవారం తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు వంగర గ్రామానికి చెందిన చొక్కాపు రామన్న(65) కొంతకాలంగా మతి స్థిమితం లేకపోవడంతో ఎప్పుడు ఎక్కడ ఉంటాడో తెలియని పరిస్థితి. దీంతో ఆహారం తినకుండా తిరగడం వల్ల ఎండ తీవ్రతతో వడదెబ్బకు గురై మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య నర్సయ్య పెళ్లైన ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్ ఢీకొని మహిళ మృతి


మృతి చెందిన సత్యవతి

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారం జంక్షన్ సమీపంలో జాతీయరహదారిపై మోటార్‌సైకిల్ ఢీకొనడంతో ఓ మహిళ తీవ్రగాయాల పాలై చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ద్విచక్ర వాహన చోదకుడు జాతీయ రహదారి దాటుతున్న పూసపాటి రేగ గ్రామానికి చెందిన గొర్లె సత్యవతి(40)ని బలంగా ఢీకొట్టాడు. దీంతో ఆమె తీవ్ర గాయాల పాలవడంతో తిరుమల మెడికవర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లాకేంద్రాస్పత్రికి పోలీసులు తరలించారు. ఈమేరకు పూసపాటిరేగ ఎస్సై ఎ. సన్యాసినాయుడు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలువురిపై దాడి కేసు నమోదు

వీరఘట్టం: స్థానిక సీబీఎం వీధిలో మంగళవారం రాత్రి జరిగిన తగాదాలో ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ ఫకృద్దీన్ బుధవారం తెలిపారు. సులజోడు అనీల్,సందీప్‌లపై అదే వీధికి చెందిన 19 మంది దాడి చేసినట్లు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దాడి కేసు నమోదు చేశామని చెప్పారు. అనిల్, సందీప్‌లకు రక్తం వచ్చేలా గాయాలు కావడంతో వారిని చికిత్స కోసం పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించామన్నారు. అలాగే మరో వర్గానికి చెందిన లతశ్రీ పట్ల అనిల్‌తో పాటు మరో 12 మంది అసభ్యకరంగా వ్యవహరించారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు. ఆ వీధిలో తగాదాలు జరగకుండా పోలీస్ పికెట్ ఏర్పాటు చేశామని ఎస్సై చెప్పారు.

రూ.1.83 లక్షల నగదు పట్టివేత

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా రూ.1.83 లక్షల నగదును పట్టుకున్నామని ఎస్సై ఇ.శ్రీనివాసరావు తెలిపారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఈ నగదును ద్విచక్రవాహనంపై పాలకొండ నుంచి రాజాం వైపు వస్తున్న ఓ వ్యక్తి తీసుకెళ్తుండగా పట్టుకున్నట్లు వెల్లడించారు. ఆ నగదును సీజ్ చేయడంతో పాటు వ్యక్తిపై కేసు నమోదుకు జిల్లా అధికారులకు వివరాలు పంపించామని తెలియజేశారు.

బొండపల్లిలో రూ.లక్షా 65 వేలు సీజ్

బొండపల్లి: వాహనాల తనిఖీల్లో భాగంగా బొండపల్లి మండల కేంద్రంలో జాతీయ రహదారిపై ఎటువంటి పత్రాలు లేకుండ కారులో తరలిస్తున్న రూ.లక్షా 65 వేలు నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు ఎసై కె.లక్ష్మణరావు తెలిపారు. బుధవారం సాయంత్రం వాహనాలు తనిఖీ చేస్తుండగా గజపతినగరం నుంచి విజయనగరం వైపు కారులో రవ్వా సుజిత్ అనే వ్యక్తి ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా నగదు తీసుకు వెళ్తుండగా పట్టుకుని జిల్లా ఎన్నికల అధికారికి అప్పగించినట్లు చెప్పారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

భారీగా నగదు స్వాధీనం


నగదు లెక్కిస్తున్న అధికారులు

నరసన్నపేట: ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి రసీదులు లేకుండా వాహనాల్లో ఉన్న రూ.5.03 లక్షల నగదును నరసన్నపేట టీడీ గాయిత్రి ఆధ్వర్యంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బుధవారం పట్టుకున్నారు. జమ్ము కూడలి వద్ద ఉమ్మిలాడకు చెందిన కొమరి నీలాద్రి నుంచి రూ.4 లక్షలు, మడపాం టోల్‌గేట్ వద్ద లావేరు మండలం పెద్ద లింగాలపాడుకు చెందిన లంక శ్రీనివాసరావు వద్ద రూ.1.03 లక్షలు స్వాధీనం చేసుకుని ఆర్‌ఓకు అప్పగించారు.

- నరసన్నపేట: సంతపేట వద్ద నిర్వహించిన తనిఖీల్లో ద్విచక్ర వాహనదారు నుంచి రూ.2.30 లక్షలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం వీవీఎం రాజు స్వాధీనం చేసుకున్నారు. వెండి హోల్‌సేల్ దుకాణంలో పనిచేస్తున్న మెట్ట సంతోష్ ఎటువంటి రశీదులు లేకుండా ఈ మొత్తం తరలిస్తున్న గుర్తించి నగదును ఆర్‌ఓకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు.
- ఇచ్ఛాపురం రూరల్: వ్యాన్‌లో ఎటువంటి ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ.2లక్షల 46వేల 810 నగదును ఇచ్ఛాపురానికి చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్ పట్టుకుంది. బుధవారం మధ్యాహ్నం బరంపురం నుంచి వ్యాన్‌లో నగదును తరలిస్తుండగా స్థానిక శ్రీరామలింగేశ్వర ఆలయ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో నగదు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఆర్‌ఓ బి.సుదర్శన దొర తెలిపారు.

జాబ్‌మేళాలో 200 మంది ఉద్యోగాలకు ఎంపిక

- భద్రగిరి ఆర్‌ఐటీఐ ప్రిన్సిపాల్ సునీల్ కుమార్


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు సూచనలు చేస్తున్న కంపెనీ ప్రతినిధి రాఘవేంద్ర యాదవ్

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి ప్రభుత్వ ఆర్‌ఐటీఐ వద్ద బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 200 మంది నిరుద్యోగ యువతీ యువకులను ఉద్యోగాల నిమిత్తం ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ సీహెచ్. సునీల్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఐటీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాకు ఎడ్కో(ఏడీఈసీసీఓ), టాటా కంపెనీలకు చెందిన ప్రతినిధి రాఘవేంద్ర యాదవ్ హాజరై, జాబ్‌మేళాకు విచ్చేసిన 250 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి, 200 మందిని ఉద్యోగాల కోసం ఎంపిక చేశారని తెలిపారు. యువకులను హైదరాబాద్‌లోని ఎడ్కో కంపెనీలో, యువతులకు బెంగళూర్‌లోని టాటా కంపెనీలో ఐఫోన్లు తయారు చేసే పరిశ్రమలో ఉద్యోగాల కోసం ఎంపిక చేశారన్నారు. జాబ్‌మేళాలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ బి.త్రినాథ, ఐటీఐ ఫ్యాకల్టీ ఉన్నారు.

వేసవి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: టీటీసీలో 42 రోజుల వేసవి ట్రైనింగ్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి జి. వగడాలమ్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోర్సు విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు కడప, అనంతపురంలో మే 1 నుంచి జూన్ 11వ తేదీ వరకు నిర్వహించనున్నారని తెలిపారు. ఆన్‌లైన్ అప్లికేషన్ ఈనెల 4 నుంచి 25వ తేదీ వరకు ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీ.జీటీవీ.ఇన్‌లో అందుబాటులో ఉంటుందన్నారు. ఆన్‌లైన్ అప్లికేషన్‌కు ఈ నెల 25 చివరి తేదీ అని తెలిపారు. ఆన్‌లైన్ అప్లికేషన్ ముగించిన తరువాత ఎటువంటి అభ్యర్థనలు అంగీకరించబోరని, ఎటువంటి ఆఫ్‌లైన్ అప్లికేషన్‌లు అగీకరించరని తెలిపారు. మే 1 నాటికి 18 సంవత్సరాలు నిండినవారు, 45 సంవత్సరాల లోపు వయసు కలిగిన అభ్యర్థులు అర్హులని తెలపారు

విద్యార్హతలు (కింద తెలిపిన అర్హతల్లో ఏదో ఒకటి కలిగి ఉండాలి)

10 వ తరగతి పాస్ అయ్యి టీటీసీలో లోయర్ పూర్తి చేసి ఉండాలి. ఎస్ఎస్‌సీ ఒకేషనల్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్, ఏపీ జారీ చేసిన ఒకేషనల్ పాస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. స్టేట్‌బోర్డు ఆఫ్ టెక్నికల్, ట్రైనింగ్ (ఎస్‌బీటీఈటీ)ఏపీ జారీ చేసిన సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు కలిగిన ఐటీఐ ఇనిస్టిట్యూట్ జారీ చేసిన నేషనల్ ట్రేడ్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ఇండస్ట్రీస్ కామర్స్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన, ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ హ్యాండ్లూమ్ వీవింగ్ జారీ చేసిన పాస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. తెలుగు విశ్వ విద్యాలయం జారీ చేసిన కర్నాటిక్ మ్యూజిక్ (వోకల్/వీణ/వయొలిన్)లో డిప్లమో సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ఏదైనా విశ్వవిద్యాలయం నుంచి బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సర్టిఫికెట్ కలిగి ఉండాలి. ఈ కోర్సుకు అప్లై చేయదలచిన విద్యార్థులు ఈ నెల 25 లోగా అప్లై చేసుకుని కోర్సు కేంద్రం ఎంపిక చేసుకుని జిల్లా విద్యాశాఖాధికారి వారి కార్యాలయంలో అప్లికేషన్ సబ్‌మిట్ చేసి మే 1 నుంచి తరగతులకు హాజరు రావాలని సూచించారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం


దగ్ధమవుతున్న ట్రాక్టర్

నెల్లిమర్ల రూరల్: మండలంలోని ఎంబేరయ్య గుళ్ల గ్రామంలో గడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ పూర్తిగా కాలిబూడిదైంది. బుధవారం జరిగిన ఈ ఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తంగుడుబిల్లి గ్రామానికి చెందిన పిల్లా రమణ వ్యక్తి తన ట్రాక్టర్‌తో గడ్డి లోడు తీసుకువస్తుండగా..ఎంబేరయ్య గుళ్ల వద్ద విద్యుత్ వైర్లు తాకడంతో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదాన్ని గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ వెంటనే అప్రమత్తమై కిందికి దూకేయడంతో ప్రాణనష్టం తప్పింది. కాగా ట్రాక్టర్ పూర్తిగా కాలిబూడిదైంది. భారీగా మంటలు చెలరేగడంతో పాటు టైర్లు బ్లాస్ట్ కావడంతో స్థానికులు భయాందోళన చెందారు. సుమారు రూ.8లక్షలు విలువ చేసే ట్రాక్టర్ అగ్నికి ఆహుతవడంతో బాధితుడు రమణ కన్నీరుమున్నీరయ్యాడు. విద్యుత్ వైర్లు కిందికి వేలాడడమే ప్రమాదానికి ప్రధాన కారణమని, ఈ గ్రామంలో ఇది రెండో ప్రమాదమని స్థానికులు చెబుతున్నారు.

జీఎంఆర్ ఐటీలో పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్


పవర్ లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న జీఎంఆర్ ఐటీ ప్రిన్సిపాల్ తదితరులు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీలో జేఎన్‌టీయూ జీవీ అంతర్ కళాశాలల పవర్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. బుధవారం జరిగిన ఎంపిక పోటీలను జీఎంఆర్ ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ ప్రారంభించారు. ఈ పోటీల్లో జేఎన్‌టీయూ జీవీ పరిధిలోని కళాశాలల నుంచి 90 మంది విద్యార్థులు పాల్గొని వివిధ కేటగిరీలలో ప్రతిభ చూపారు. హోరాహోరీగా జరిగిన ఎంపిక పోటీల్లో పురుషుల 59 కేజీల విభాగంలో పి.మోహన్ (జీఎంఆర్ ఐటీ), ఎం.సాయియశ్వంత్ (డైట్ కళాశాల), డి.అఖిల్ (రఘు ఇంజినీరింగ్ కళాశాల) ప్రథమ, ద్వితీయ, తృతీయస్థానాలు సాధించారు. అలాగే 47 కేజీల స్త్రీల విభాగంలో ఎం.కవిత, జి.సాత్విక (జీఎంఆర్ ఐటీ), ఎ.లావణ్య (డైట్ కళాశాల)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విజేతలను ప్రిన్సిపాల్‌తో పాటు స్టూడెంట్స్ డీన్ డాక్టర్ వి.రాంబాబు, జేఎన్‌టీయూ జీవీ అబ్జర్వర్ డాక్టర్ రజనీకాంత్, జేఎన్‌టీయూ జీవీ ఎక్స్‌టర్నల్ ఎస్.అనిల్ తదితరులు అభినందించారు.